ప్రజాశక్తి

మంగళవారం 21 జనవరి 2025 5

శ్రీకాకుళం



పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.రాజగోపాలరావు ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు ఈ శిబిరాలను నిర్వహించి అనారోగ్యంతో ఉన్న పశువులకు ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాశాలలు లేని గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో గ్రామాల్లో వ్యాధి నివారణ టీకాలు వేయని పశువులకు జబ్బ వాపు, గొంతువాపు, ముద్ద చర్మవ్యాధి, గాలికుంటి వ్యాధి టీకాలు అన్ని పశు వైద్య కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేరడి బ్యారేజీ... సిక్కోలు ప్రజల చిరకాల వాంఛ. బ్యారేజీ నిర్మాణం జరిగితే జిల్లాకు సాగునీటి వెతలు తీరే అవకాశం ఉంది. పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో అది తీరని కలగానే ఉండిపోయింది. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు నేరడిని పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ హామీనిచ్చారు. తన ఐదేళ్ల పదవీ కాలంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. రాష్ట్రంలో ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం, కేంద్రంలో టిడిపి భాగస్వామ్యంగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఉంది. పైగా ట్రిబ్యునల్ తీర్పులూ మనకు అనుకూలంగానే ఉన్నాయి. వ్యవసాయం, సాగునీటి రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తామంటూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 2024-29 డాక్యుమెంట్‌లో ప్రస్తావించింది. అందులో కనీసం నేరడి బ్యారేజీ అంశాన్నే ప్రస్తావించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోంది.



'నేరడి' కలేనా..?

- బాబు విజన్‌లో లేని బ్యారేజీ
- డాక్యుమెంట్‌లో అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టులే ప్రస్తావన
- వ్యవసాయంలో మాత్రం రెట్టింపు ఆదాయం లక్ష్యం
- 2024-29 విజన్ డాక్యుమెంట్‌లో గొప్పలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధారలో లభ్యమయ్యే 115 టిఎంసిల నీటిలో 50 శాతం వినియోగించుకునేందుకు 1962 సెప్టెంబర్ 30న ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల మధ్య అంగీకారం కుదిరింది. శ్రీకాకుళం జిల్లా భామిని మండలం కాట్రగడ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా అంగీకారం తెలిపింది. 1986లో అప్పటి ఎపి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, ఒడిశా సిఎం బిజూ పట్నాయక్ మధ్య ముఖాముఖి చర్చలు సైతం జరిగాయి. ఆ తర్వాత 2000లో అధికారంలోకి వచ్చిన ఒడిశా అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజెడి, బిజెపి సంకీర్ణ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణానికి రకరకాల అభ్యంతాలను చెప్తూ వస్తోంది. ఆ తర్వాత ఒడిశా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సమస్యను నివేదించడంతో, 2010లో కేంద్ర ప్రభుత్వం వంశధార ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఇరు రాష్ట్రాలను పలు సందర్భాల్లో సందర్శించిన ట్రిబ్యునల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా బ్యారేజీ నిర్మాణానికి అనుమతినిస్తూ వంశధార నదీ జల వివాదాల ట్రిబ్యునల్ సెప్టెంబర్ 13, 2017లో తీర్పు నిచ్చింది. బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన 106 ఎకరాలను సేకరించి ఇవ్వాలని ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ట్రిబ్యునల్ తీర్పు అనుకూలంగా వచ్చినా పాలకుల నుంచి ఆ చొరవ లేకపోవడంతో, నేరడి బ్యారేజీ అంశం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారింది.

చొరవ చూపని టిడిపి కూటమి ప్రభుత్వం

ట్రిబ్యునల్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం తరుపు నుంచి ఇంజినీరింగ్ అధికారులు సిద్ధమైనా, ఒడిశా అధికారుల నుంచి స్పందన కనిపించడం లేదు. ట్రిబ్యునల్ తీర్పుపై రెండేళ్ల కిందట ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో వివాదం కొనసాగుతోంది. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, కేంద్ర ప్రభుత్వంతో పాటు ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించగలిగితే అంతర్రాష్ట్ర జల వివాదం కొలిక్కి వచ్చే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు చేసినట్లు కనిపించడం లేదు.

ఆదాయం రెండింతలు చేస్తారట!

జిల్లాను ఎప్పటికప్పుడు కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. వంశధార, నాగావళి వంటి నదీ వనరులున్నా, వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. హిరమండలం వద్ద నిర్మించిన గొట్టా బ్యారేజీలో 0.612 క్యూసెక్కులకు మించి నీరు నిల్వ ఉంచే అవకాశాలు లేవు. ప్రాజెక్టును నిర్మిస్తే 19 టిఎంసిల వరకూ నీటిని నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుంది. తద్వారా 2.10 లక్షల ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా 45 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వవచ్చు. ఖరీఫ్, రబీ సీజన్‌లో ఇంజిన్లతో పంటలను తడుపుకునే పాట్లు తప్పతాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో వేసిన వరి, వేరుశనగ, మినప, పెసర, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతుండడంతో వంశధార ద్వారా నీళ్లు ఇవ్వాలంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును రైతులు కోరాల్సి వచ్చింది. వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాది ఖరీఫ్‌లోనూ పూర్తిస్థాయిలో రైతులు పంటలు వేయలేకపోయారు. ఖరీఫ్ వరి సాధారణ సాగు 4,212024 ఎకరాలు కాగా, గతేడాది ఖరీఫ్‌లో 3,59,495 ఎకరాల్లోనే పంట సాగు అయింది. పంటలకు సరిగా నీళ్లే ఇవ్వకుండా వ్యవసాయంలో గణనీయమైన అభివృద్ధి చేస్తామంటూ ప్రభుత్వం గొప్పలు చెప్తోంది. జిల్లాలో అన్ని రంగాల ద్వారా వచ్చిన ఆదాయం (జిడిడిపి)లో వ్యవసాయ వాటాను రూ.4,228 కోట్ల నుంచి రూ.7,892 కోట్లకు అంటే రెండింతలు పెంచుతామంటూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొంది. సాగునీటి పరిస్థితులను మెరుగుపరచకుండా, ఏటా తలెత్తుతున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం అభివృద్ధి, రైతుల ఆదాయం ఎలా పెరుగుతుందో, రెండింతల లక్ష్యం ఎలా నెరవేరుతుందో ప్రభుత్వమే చెప్పాలి.



ధర్నా చేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ వద్ద పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సహకార శాఖ పరిధిలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, 2019 పిఆర్‌సిని అమలు చేయాలని సిఐటియు సీనియర్ నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రంగనాథ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్.మోహనరావు, బి.రామారావు డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన పిఎసిఎస్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ జిఒను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.20 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. 2019 తర్వాత ఉద్యోగంలో చేరిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘ ఉద్యోగులకు 2019 మార్చి ఒకటో తేదీన జారీ చేసిన జిఒ నంబరు 36 (హెచ్.ఆర్ పాలసీతో కూడిన వేతనాలు) అమలు చేయాలని కోరారు. గత ఐదేళ్లుగా ఈ జిఒ అమలు కోరుతూ అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదన్నారు. జిఒ ఇచ్చిన నాటి చంద్రబాబు ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ఆ జిఒను అమలు చేస్తారన్న నమ్మకంతో వేచిచూశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ జిఒను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు. సహకార శాఖ కమిషనర్ బాబు ఇచ్చిన హామీ మేరకు కంప్యూటరీకరణ డిసిటి, ప్రీ మైగ్రేషన్ పనులు పూర్తి చేశామని, కమిషనర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ఎ.పాపినాయుడు, కోశాధికారి కె.లక్ష్మీనారాయణ, కన్వీనర్ బి.సన్యాసిరావు, ఉపాధ్యక్షులు ఎ.జగదీష్, పి.ఎస్.ఎన్ దాసు, కార్యదర్శి బి.జానకి తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం తహశీల్దార్, విఆర్‌ఒకు షోకాజ్ నోటీసులు

- ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 'మీకోసం'కు 91 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఫిర్యాదు పరిష్కారంలో అలసత్వం వహించిన హిరమండలం తహశీల్దార్ ఎన్.హనుమంతరావు, విఆర్‌ఒ భాస్కర పట్నాయక్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సోమవారం 'మీకోసం'లో భాగంగా వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 91 వినతులు వచ్చాయి. తన స్థలం వంశధార కుడి కాలువగా ఇసిలో నమోదైందని, దాన్ని సరిదిద్ది నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని హిరమండలం మండల కేంద్రానికి చెందిన పి.రాజేశ్వరి పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో రెండు నెలల కిందట 'మీకోసం'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేయాలని హిరమండలం తహశీల్దార్‌ను గతంలో ఆదేశించారు. తహశీల్దార్ విఆర్‌ఒ భాస్కర పట్నాయక్‌కు అప్పగించారు. తన ఫిర్యాదుపై విచారణ చేపట్టలేదంటూ ఆమె మళ్లీ సోమవారం ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్, విఆర్‌ఒకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావును ఆదేశించారు.

టెక్కలి మండల కేంద్రంలో తాను కొనుగోలు చేసుకున్న భూమి ప్రభుత్వ భూమిగా నమోదు చేశారని, రికార్డులను సరిదిద్దాలని కోరుతూ కె.రామారావు ఫిర్యాదు చేశారు. ఎల్.ఎన్ పేటకు చెందిన వరలక్ష్మి తన భూమిని వేరొక వ్యక్తి పేరుతో పట్టాదారు పాసు పుస్తకాల్లో తప్పుగా నమోదు చేసి చేశారని ఫిర్యాదు చేశారు. పూర్వీకుల నుంచి తనకు ఆస్తి సంక్రమించినా రెవెన్యూ సిబ్బంది సర్వే సమయంలో తప్పుగా నమోదు చేశారని తెలిపారు. పలాస మండలం కొటారింగ్ సవర లింగుపురం గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరస్వామి కోరారు.

అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, ఇతర అధికారులున్నారు.



ఆమదాలవలస : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

సాగునీటి వనరుల్లో నిర్మాణాలు వద్దు

ప్రజాశక్తి - పొందూరు, ఆమదాలవలస

సాగునీటి వనరులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టవద్దని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండలం కనిమెట్ట, ఆమదాలవలస మండలంలో ఆనందపురంలో సోమవారం రీ సర్వే ప్రారంభోత్సవ ర్యాలీలో పాల్గొన్న అనంతరం సభలో మాట్లాడారు. చెరువు గర్భం, చెరువు గట్టు, కాలువ గట్టు, కాలువ గర్భం, గెడ్డగర్భం, గెడ్డగట్లలో ఆక్రమణలు తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను విధిగా పాటించాల్సి ఉంటుందన్నారు. ఏదో రోజు ఆక్రమణలు కూల్చివేత తప్పదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో సుమారు 13 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని వైసిపి నాయకులు ఆక్రమించారని ఆరోపించారు. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేస్తోందన్నారు. రీ సర్వేలో ఏ రైతుకూ అన్యాయం జరగకూడదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు వెంకటేష్ రామానుజులు, పి.రాంబాబు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, సర్పంచ్ బి.లక్ష్మి, ఎంపిటిసి కె.లక్ష్మి, టిడిపి నాయకులు నూక రాజు, సచివాలయ సిబ్బంది, సర్వే అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

న్యాయ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ప్రభావవంతమైన మార్గమని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం అనే అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి శిక్షణలు తోడ్పాటు అందిస్తాయన్నారు. న్యాయవాదులు ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం నేర్చుకోవాలని సూచించారు. ఈనెల 24 వరకు కొనసాగే ఈ శిక్షణ తర్వాత న్యాయవాదులు మధ్యవర్తిత్వ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కన్సీలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసిపిసి) సభ్యులు అనూజా సక్సేనా, వీణా రళ్ళి మాస్టర్ శిక్షకులుగా వ్యవహరించారు. ఈ శిక్షణలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను ఎలా పరిష్కరించాలి, దాని ప్రయోజనాలు, సవాళ్లు వంటి అంశాలపై చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా పలు బార్ అసోసియేషన్ల నుంచి ఎంపిక చేసిన పలువురు న్యాయవాదులు హాజరయ్యారు.

పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రథసప్తమి వేడుకల్లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. అరసవల్లి జంక్షన్, అరసవల్లి రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. మిల్లు జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న సర్కిల్, రోడ్డు సెంటర్ డివైడర్ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు దక్షిణామూర్తి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, వన్ టౌన్ సిఐ పైడపు నాయుడు, ట్రాఫిక్ సిఐ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

తొలిసారి హెలీకాప్టర్ టూరిజం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవిల్లి రథసప్తమి వేడుకలను వచ్చే నెల రెండో తేదీ నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఇందులో భాగంగా డచ్ బిల్డింగ్ వద్ద తొలిసారి హెలీకాప్టర్ టూరిజంను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రథసప్తమి ఉత్సవాలను మూడు రోజుల పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలన్నారు. తొలి రోజు 80 అడుగుల రోడ్డు వద్ద ఉదయం ఏడు గంటలకు సామూహిక సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎద్దుల బళ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తామని చెప్పారు. డచ్ బిల్డింగ్ వద్ద హెలికాప్టర్ టూరిజం ఏర్పాటు చేసామని, 80 అడుగుల రోడ్డు వద్ద వివిధ రకాల స్టాల్స్, అక్కడే ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఏడు రోడ్ల కూడలి నుంచి అరసవల్లి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 అడుగుల రోడ్డు వద్ద సాయంత్రం ఐదు నుంచి రాత్రి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి 9.30 గంటలకు లేజర్ షో, రాత్రి 10 గంటలకు డచ్ బిల్డింగ్ వద్ద క్రాకర్స్ షో ఉంటాయని అన్నారు. మూడు రోజుల పాటు అరసవెల్లి ఆలయంలో సూర్య యాగం ఉంటుందని, సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE III ADDL CUM SPL PROHIBITION AND EXCISE MAGISTRATE JUDGE AT SRIKAKULAM
O.S. 446 /2023

Between
Simma Nagarjuna S/o Late Vaikunta Rao, aged 34 years, Resident of D.No.11-144, Tangivani peta, Village, Peddapadu Vai, Srikakulam rural Mandal, Srikakulam Dist. ....Petitioner

And:
1. Panchireddy RamanaMurthy S/o Yerrayya Mamidivalasa Village, Srikakulam Rural Mandal and Dt.
2. Panchireddy Yerrayya S/o Late Gangayya, Mamidi Valasa Village Srikakulam Rural Mandal and Dt.
3. Chintada Lakshmana Rao S/o Late Dalayya, Singupuram Village, Srikakulam Rural Mandal and Dt.
4. Chintada Ravi S/o Chintada Lakshmana Rao, Singupuram Village, Srikakulam Rural Mandal and Dt.
5. Malla Suresh S/o SubbaRao, Palasa Main Road, Palasa Village and post, Mandal Srikakulam dist.
6. Chelikana Mahesh S/o Late Gopalakrishna Prasanthinagar colony, Singupuram Village and post, Srikakulam dist.
7. Budumuru Prasanthi D/o Amminaidu Oppivada Venkam peta Village, Burja Mandal, Srikakulam dist.
8. Seepana Teja D/o, Rama Rao W/o Sura Rangandhamu, Sepannaidu peta Village, Srikakulam dist.
9. Boddepalli Thaviti Naidu S/o Late Ramurthy, Kotta Valasa Village, Amadalavalasa Mandal, Srikakulam dist. ....Respondents/Defendants

GONDU JANARDHANA RAO
Advocate for petitioner,
Srikakulam, Cell No. 9849196744.


పరామర్శిస్తున్న ప్రసాదరావు

వి.జి.కె కుటుంబానికి ధర్మాన పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సిపిఎం నాయకులు వి.జి.కె మూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నగరంలోని కత్తెర వీధిలోని మృతుని కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ముందుగా మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మూర్తి మనమధ్య లేకపోవడం బాధాకరమని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. మూర్తి అందరివాడని అన్నారు. సమాజంపై ఎంతో మక్కువతో కూడిన బాధ్యతతో, ప్రజల కష్టాల పట్ల ప్రేమతో, అందరికోసం అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. సమాజ మార్పు పట్ల ఆయనకున్న నిబద్ధత ఇంతటివాడిని చేసిందన్నారు. మూర్తి అందరి ఆత్మీయులని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటే సమాజ మార్పులో అందరం భాగమవుతామని అన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

వి.జి.కె మూర్తికి నివాళి

కొత్తూరు: వి.జి.కె మూర్తి మృతి ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్ అన్నారు. స్థానిక చిట్టిబాబు కాంప్లెక్స్‌లో వి.జి.కె మూర్తి సంతాప సభ సోమవారం నిర్వహించారు. ముందుగా మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎం, ప్రజా సంఘాల్లో అనేక బాధ్యతలను నిర్వర్తించారని అన్నారు. 1972లో ఎల్ఐసిలో ఉద్యోగిగా చేరి 1992లో సిఐటియు జిల్లా వ్యవస్థాపక అధ్యక్షునిగా పనిచేశారని అన్నారు. 1991లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేశారన్నారు. జ్యూట్, శాంపిస్టన్ కార్మికుల సుదీర్ఘ పోరాటంలో కీలక పాత్ర వహించారని అన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం జిల్లా అధ్యక్షునిగా, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారని అన్నారు. మూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, సింహాచలం, కృష్ణ, తులసీరావు పాల్గొన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌కు అభినందనలు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనిక శాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్ బల్క్ డ్రగ్ పదార్థాల్లో సోనీ దిగిట్ సేంద్రీయ మలినాలు లెక్కించడం అనే అంశంపై సాఫ్ట్‌వేరే రూపొందించారు. ఇందుకు గాను ఇండియన్ పెంటెంట్ హక్కులు పొందారు. దీనిపై ప్రిన్సిపాల్ గోవిందమ్మ అభినదించారు.

తీరంలో సౌకర్యాలు నిల్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం ప్రాంతానికి మణిహారంగా ఉన్న అక్కుపల్లి శివసాగర్ తీరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీంతో పర్యాటకులు ఇక్కడకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇక్కడకు ఒడిశా రాష్ట్ర వాసులతో పాటు జిల్లాలోని కాశీబుగ్గ, పలాస పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు నిత్యం వచ్చి తీరంలో సందడి చేస్తూ మానసిక ఆనందాన్ని పొందుతున్నారు. అయితే కొంత మంది ఆకతాయిల తీరు స్థానికులతో పాటు పర్యాటకులకు పంటిలో పడిన రాయిలా మారింది. తీరంలో సరదాగా గడుపుదామని వస్తే ఆకతాయిల ఆగడాలతో అవస్థలు పడుతున్నారు. మద్యం మత్తులో చేస్తున్న అల్లరి చేష్టలతో ఇబ్బందులు ఎదురవుతాయి. సముద్రం పై నుంచి వీచే చల్లని గాలులు ఓ వైపు సవ్వడి చేస్తుంటే... మరో వైపు తీరంలో మందుబాబుల ఆగడాలు శృతిమించుతున్నాయి. నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుదామంటే సరైన పర్యాటకం లేదు. అలాంటి వారికి తీరమే దిక్కు అయితే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. మందుబాబులు పూటుగా తాగి పగలుగొట్టిన మద్యం సీసా పెంకులు తీరానికి వచ్చేవారికి స్వాగతం పలుకుతున్నాయి. అలాగే ఇక్కడకు వచ్చే ప్రేమజంటలపై సైతం మందుబాబులు దాడి చేసి ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన స్నేహితుల దినోత్సవం, నూతన సంవత్సర రోజున కొంతమంది ఆకతాయిలు మద్యం సేవించి తీరంలో హల్‌చల్ చేసి సముద్ర స్నానానికి దిగి అలలకు చిక్కారు. దీనిని గమనించిన మత్స్యకారులు వారిని ప్రాణాలతో కాపాడారు.


తాగి పడేసిన మద్యం సీసాలు


అసంపూర్తిగా మిగిలిన భవనాలు

అభివృద్ధి నిధులు దుర్వినియోగం

అక్కుపల్లి శివసాగర్ బీచ్ అభివృద్ధికి ఏడేళ్ల క్రితం రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పటి కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతో రక్షణ గోడ సముద్ర అలల తాకిడికి కొట్టుకుపోయింది. అలాగే తీరంలో ఏర్పాటు చేసిన షెడ్లు తిత్లీ తుపానుకు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి తీరంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ షెడ్లు మందుబాబులకు ఉపయోగపడుతున్నాయి.

గోనెపాడులో గ్రామసభ రసాభాస

నిలిచిన సిసి రోడ్డు పనులు

సరుబుజ్జిలి : మండలంలోని గోనెపాడులో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై అధికారులు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో ఇరు గ్రూపుల వాదనలతో రసాభాసాగా మారింది. గ్రామంలో డ్రెయినేజీలతో కూడిన సిసి రోడ్డు నిర్మాణానికి రూ.44.40 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రారంభించారు. సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, ఎంపిటిసి మెట్ట రాము, టిడిపి నాయకుడు సీపాన రామచంద్రమూర్తి ఆధ్వర్యాన ఇటీవల పోలీస్ బందోబస్తు మధ్య కొన్ని పనులు పూర్తి చేశారు. ప్రధాన వీధి రహదారి డ్రెయినేజీతో కూడిన సిసి రహదారి నిర్మాణానికి కొన్ని గృహాల వద్ద కొంతమేర నిర్మాణాలు తొలగించాల్సి ఉంది. దీనిపై ఇటీవల మండల సర్వేయరు సర్వే నిర్వహించిన విధానంపై వీధిలో ఉన్న యజమానులతో పాటు మరో గ్రూపునకు చెందిన అభ్యంతరం వ్యక్తం చేశారు. సిసి రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడంతో వారం రోజులుగా ఆ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గతంలో పోలీస్ రికార్డుల్లో అతి సమస్యాత్మక గ్రామంగా నమోదైన ఈ గ్రామంలో మళ్లీ ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మండల అధికారులతో పాటు పోలీసులూ పాల్గొని రహదారి నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించడానికి రెండు తేదీలు నిర్ణయించారు. మళ్లీ వాయిదా పడడంతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టిన వ్యక్తులు అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో సోమవారం మండల పంచాయతీ అధికారి బొడ్డేపల్లి రామారావు, విఆర్ఒ, కార్యదర్శులు గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభలో ఇరు గ్రూపుల వారు ఒకరిపై ఒకరు వాగ్వాదం చేసుకుంటూ ఒక దశలో గ్రామసభలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నాయి. సమాచారం అందున్న ఎస్ఐ బి. హైమావతి పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని సర్దిచెప్పారు. దీంతో చేసేదేమి లేక గ్రామ ప్రధాన వీధి డ్రెయినేజీతో కూడిన సిసి రహదారి నిర్మాణంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేక అధికారులు గ్రామసభను ముగించారు.


వాదులాడుకుంటున్న గ్రామస్తులు



చెదరగొడుతున్న పోలీసులు

బాలకృష్ణాపురం గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని బాలకృష్ణాపురంలో వారసత్వం ఆస్తుల ఆక్రమణలపై ఇరు గ్రూపులకు చెందిన వారి మధ్య ఘర్షణ వాతావరణం నెలకుంది. దీనిపై తహశీల్దార్ కార్యాలయం వద్ద పాస్ పుస్తకాలను చేతబట్టి సోమవారం నిరసన తెలిపి తహశీల్దార్ వెంకటరావుకు ఫిర్యాదు చేశారు. అలాగే రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ తాతల నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తి తమకు తెలియకుండా నూకల దాలమ్మ అనే మహిళ వేలుముద్రల ద్వారా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు విశాఖపట్నానికి చెందిన సంజయ్ కుమార్ రియల్ ఎస్టేట్ వ్యక్తికి అమ్మి కబ్జా చేశారని అన్నారు. గ్రామానికి చెందిన బడకల మోహన్‌దాస్, బడకల ఢిల్లయ్య, బడకల చంద్రయ్య, బడకల తులసయ్య, బడకల దుర్గమ్మ, బడకల మహాలక్ష్మి, బడకల బానయ్యకు చెందిన 4.65 ఎకరాల భూమిని దాలమ్మ పేరిట పొరపాటున అడంగల్‌లో వచ్చిందన్నారు. ఆమెకు మాయమాటలు చెప్పి సర్పంచ్ ప్రతినిధి లోహిదాస్, బడకల కుమారి, మరో ముగ్గురు వ్యక్తులు ఇచ్ఛాపురానికి చెందిన సోమేశ్‌రెడ్డి, బెండాళం జయప్రకాష్ పత్రాలను తారుమారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని అన్నారు. అనంతరం విశాఖకు చెందిన సంజయ్ కుమార్ నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిని చదును చేసేందుకు ప్రొక్లెయినర్ తీసుకురావడంతో అడ్డుకున్నామని అన్నారు. అధికారులు స్పందించి తమ భూమిని తమకు ఇప్పించాలని కోరారు. స్పందించిన రూరల్ పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టారు. ఇరు గ్రూపుల చెందిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పురపాలక సంఘ అభివృద్ధికి నిధుల మంజూరు

ఆమదాలవలస : పురపాలక సంఘ అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,84,18,656 మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో విడుదలైంది. పురపాలక సంఘానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల టైడ్ అన్ టైడ్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుప రిచేందుకు గార్బేజ్ కాంపాక్టర్ వాహనం కాంపాక్టర్ బిన్స్‌కు రూ.53,64,389, నీటి సరఫరా మెరుగుప రిచేందుకు నాగావళి నది కొత్తవలస వద్ద ఉన్న పంపు హౌస్‌కు 40 కెవిఎ జనరేటర్ కొనుగోలుకు, అలమాజీపేట వాటర్ పంపు హౌస్ మెరుగుపచేందుకు కొత్తవలస పంపు హౌస్ భవనం, ప్రహరీ నిర్మాణానికి రూ.27,21,311 నిధులు విడుదలయ్యాయి. పట్టణంలోని 15 వార్డులో ఉన్న మోణింగివారివీధి రోడ్డును కొత్తగా తారు రోడ్డు వేసేందుకు రూ. 39,90,000, పురపాలక సంఘంలోని వివిధ వార్డుల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు రూ.63,42,956 నిధులు మంజూరయ్యాయి.

విద్యుత్‌శాఖ ఎఇపై ఫిర్యాదు

పొందూరు: మండలంలోని తాడివలసకు చెందిన సీపాన భాస్కరరావు పొందూరు విద్యుత్‌శాఖ ఎఇపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఇకి సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పల్లెపండగలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డుకు అడ్డుగా ఉన్న ఐదు స్తంభాల మార్పుకు, రెండు నూతన స్తంభాల ఏర్పాటుకు రూ.30 వేలు తీసుకొని రెండు రోజులపా టు పనులు చేపట్టారని అన్నారు. నాలుగు పాత స్తంభాలు మార్చారని, మిగిన పనిని రెండు రోజుల్లో పూర్తిచేస్తానని చెప్పి విస్మరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలో ఎఇని కలవగా కూలీలు రావ డంలేదని, ఇచ్చిన మొత్తం చాలడంలేదని, మరో రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లంచం డిమాండ్ చేస్తున్న ఎఇపై చర్యలు తీసుకోవాలని కోరారు.


సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

పెన్షనర్ల సంక్షేమానికి కృషి

పొందూరు: పొందూరు, జి.సిగడాం మండలాల పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు, పొందూరు, జి.సిగడాం మండలాల పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎన్.పైడిరాజులు అన్నారు. మండల కేంద్రంలో పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. పెన్షనర్ల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేసి సాధించుకుందామని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎం.సూర్యప్రకాశరావు, కోశాధికారి వి.దామోదరరావు, కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రవల్లిక

వాహనాల తనిఖీ

బూర్జ: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ప్రవల్లిక స్పష్టం చేశారు. మండలంలోని కొల్లివలస కూడలి వద్ద సోమవారం రాత్రి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడితే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అలాగే వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలన్నీ ఉండాలన్నారు.


ఫిర్యాదు చేస్తున్న ప్రతినిధులు

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

తప్పుడు పత్రాలతో మండల కేంద్రంలోని విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు చేపడుతున్న ప్రయత్నాలపై సోషల్ క్లబ్ ప్రతినిధులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 188 ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ పోరంబోకుగా నమోదైందన్నారు. ఈ సర్వే నంబరులో మండల పరిషత్ కార్యాలయంతో పాటు సోషల్ క్లబ్ భవనాలు ఉన్నాయని తెలిపారు. 60 ఏళ్ల క్రితం సోషల్ క్లబ్ భవనం పోస్టుమార్టం కేంద్రంగా ఉండేదని, తరువాత ఈ భవనంలో సోషల్ క్లబ్ నడిచేది అన్నారు. పంచాయతీకి టాక్స్ సోషల్ క్లబ్ చెల్లిందన్నారు. పది సెంట్లలో ఉన్న ఈ క్లబ్ స్థలం ఖరీదు సుమారు రూ.3 కోట్లు వరకు ఉంటుందన్నారు. ఖరీదైన ఈ స్థలంపై కొంతమంది కన్ను పడిందన్నారు. 2023లో ఈ స్థలాన్ని సర్వే నంబరు 187తో ఆరుగురు వ్యక్తుల పేరుతో నకిలీ పొజిషన్ ధ్రువపత్రాలను సంపాదించిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. విషయం తెలిసిన సోషల్ క్లబ్ ప్రతినిధులు కె.సాయికుమార్, ఎం.సుందరరావు తదితరులు రెవెన్యూ రికార్డుల ఆధారాలతో పొందూరు పంచాయతీ ఇఒ మోహన్‌బాబుకు ఫిర్యాదు చేశారు.


తరగతి గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పాఠశాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గం పరిధిలోని గార మండలం కుమ్మరిపేట ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీనిచ్చారు. ఈ మేరకు పాఠశాలను సోమవారం దర్శించారు. విద్యార్థుల రక్షణ కోసం ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్ అధికారులతో చర్చించి ఈ పనులు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మెండ దాసునాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు ఎర్రన్న విద్యాసంకల్పం తోడ్పాటు

విద్యకు ప్రాధాన్యత నిచ్చేందుకు తన తండ్రి జ్ఞాపకార్థం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఏర్పాటు చేసిన ఎర్రన్న విద్యాసంకల్పం ద్వారా పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయాలకు అందజేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం గార గ్రంథాలయానికి ఎమ్మెల్యే శంకర్ పుస్తకాలతో పాటు వాటిని భద్రపరచడానికి అవసరమైన బీరువాను అందజేశారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాస్‌నాయుడు, గార మండల టిడిపి నాయకులు గొండు వెంకటరమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బడగల వెంకటరమణమూర్తి, కొంక్యాన అదినారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు పాల్గొన్నారు.

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే గొండు శంకర్ మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థి, గ్లోబల్ స్కూల్ అధినేత ప్రసాద్ కళాశాల ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంచేందుకు వివిధ రకాలైన మొక్కలను అందజేశారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- మందస

ఇటీవల సంక్రాతి సెలవుల్లో వివిధ గ్రామాల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో సోమవారం అభినందించారు. మండలంలోని నారాయణపురం పంచాయతీ ఉద్యోగుల ఆధ్వర్యాన నిర్వహించిన క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారని అన్నారు. షీల్డ్, రూ.3,333 నగదు అందజేశారని అన్నారు. అల్లిమెరకలో నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్టులో ద్వితీయ స్థానంలో నిలిచి విద్యార్థులకు షీల్డ్, రూ.4,116 నగదు, ఎకువూరులో భోగి రోజున నిర్వహించిన పదో తరగతి విద్యార్థులు వ్యక్తిగత ప్రతిభ పరీక్షల్లో పాఠశాలకు చెందిన పైల కీర్తనలిద్వితీయ స్థానం కైవసం చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, యం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ పాల్గొన్నారు.


అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు గణేశ్వరరావు


అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు

రబీ పంటపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని మర్రిపాడులో సోమవారం పెద్ద చెరువు ఆయుకట్టు రైతులకు భూగర్భ జలశాఖ, బెజ్జిపురం యూత్ క్లబ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సమన్వయంతో ఎడి డి.లక్ష్మణరావు అవగాహనా సదస్సు నిర్వహించారు. రబి సీజన్‌లో పంటకు తగ్గనీరు ఎలా వాడాలో విషయంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హైడ్రాలజిస్టు ఎన్.రమ, శ్రీదేవి, జియాలజిస్టు జి.వెంకటయ్య, సర్పంచ్ ప్రతినిధి జల్లు బలరాంనాయుడు, నర్సింగరావు, విఆర్ఒ జె.ప్రసాదరావు, విఎఎ కింజరాపు వసంత, యూత్ క్లబ్ బెజ్జిపురం సిబ్బంది ఆర్.ఉమామహేశ్వరరావు, కె.లక్ష్మణరావు, కె.శ్రీరాములు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం చేస్తాం

పలాస : కాశీబుగ్గకు చెందిన తంగుడు రామారావు తన ఇంటి కోడలకు ఇబ్బందులు పెట్టడం సరికాదని కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరావు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నా ఆస్పత్రికి తీసుకువెళ్లకపోవడం దారుణమని అన్నారు. బాధితురాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. కాశీబుగ్గలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తంగుడు కవితను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి రోజున కవిత తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా... ఆమె అత్తమామలు, భర్త కనీసం పట్టించుకోలేదన్నారు. కవిత తల్లిదండ్రులు కాశీబుగ్గ వచ్చిన 40 నిమిషాలు తలుపు తీయకుండా ఇంటి బయట నిల్చోబెట్టడం విచారకరమన్నారు. ఈయనతో పాటు కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, నరసన్నపేట అధ్యక్ష, కార్యదర్శులు పూన పెద్దబాబు, జామి వెంకటరావు, సోంపేట, కోటబొమ్మాళి మండల అధ్యక్షులు సానా షన్ముఖరావు, సకలాభక్తుల రాంకుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి తంగుడు నాగేశ్వరరావు ఉన్నారు.


పరామర్శిస్తున్న గోవిందరావు

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - రణస్థలం

కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబరు 9న ఎస్‌కెఎంకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, ఎస్‌కెఎం నాయకులు ఆబోతుల వెంకట నాయుడు, ఆదినారాయణ, ఇజ్జురోతు రమణ కోరారు. ఈ మేరకు కోరుతూ సోమవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుని వ్యక్తిగత సెక్రటరీ రమణను సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాలు పోరాటం సమయంలో రైతులు పండించే పంటలకు మద్దతు ధర ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీనిచ్చారని గుర్తు చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలో 53 రోజులుగా జగ్జీత్ సింగ్ దల్లెవాల్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని చర్చలు చేపట్టి నిరవధిక దీక్షను విరమింపజేసేలా చర్యలు తీసుకుని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుష్టు వ్యాధి సర్వేపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఫిబ్రవరి 2 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేపై సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఈ ర్యాలీని డిఎంహెచ్ఒ డాక్టర్ బాలమురళి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న సర్వేలో సిహెచ్ఒ, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు సభ్యులుగా ఉండి ఇంటింటా పరిశీలించాలన్నారు. కుటుంబంలో సభ్యులందరికీ ఈ పరీక్షలు నిర్వహించాలన్నారు. కుట్టు వ్యాధి నిర్ధారణ అయితే వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీకాంత్, డెప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, డిపిఎంఒ వాన సురేష్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలాకి : అనుమానస్పద మచ్చలు, స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మల మీద వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కుష్టు వ్యాధిగా అనుమానించ ఉన్నట్లయితే వారి వివరాలు నమోదు చేయించుకోవాలని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ అన్నారు. మండలంలోని తొటాడ, గొల్లలవలస, డోల, పల్లిపేట గ్రామాల్లో ఆశాకార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ బాలమురళి


నుజ్జయిన కారు (ఇన్‌సెట్‌లో హరీష్ ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జలంత్రకోట జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో బారువకు చెందిన హరీష్ కుమార్ పాణిగ్రాహి (31) మృతి చెందగా, సునీల్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బారువకు చెందిన హరీష్ కుమార్, సునీల్ కుమార్ కలిసి తన స్నేహితుడు సతీష్‌ను తీసుకువచ్చేందుకు ఆదివారం ఒంటి గంటకు కారులో పలాస రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి ముగ్గురు కలిసి కంచిలి వెళ్లి, తన స్నేహితుడు సతీష్‌ను కంచిలి దిగబెట్టాడు. అనంతరం సోమవారం ఉదయం సునీల్‌తో కలిసి హరీష్ స్వగ్రామం బారువకు తిరుగు ప్రయాణయ్యారు. కంచిలి నుంచి జాతీయ రహదారిపైకి వచ్చిన హరీష్ రోడ్డును గుర్తించలేక బారువ వైపు రాంగ్ రూట్ వస్తున్నాడు. జలంత్రకోట కూడలి సమీపంలో మంచు కారణంగా ఎదురుగా వస్తున్న లారీని గమనించక బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా, సునీల్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి రోజా, సోదరుడు శిరీష్ ఉన్నారు. తండ్రి చిన్నప్పుడే ఇల్లు విడిచి వెళ్లిపోయారు. హరీష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా పది రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. హరీష్ సోదరుడు శిరీష్ బారువలోని శిరిడి సాయిబాబా ఆలయంలో అర్చకుడుగా పనిచేస్తున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

జి.సిగడాం: కూలి చేసుకుంటూ, పశువుల మేపుకుంటూ దినచర్య సాగించిన పోలారావు (45)కు మినీ బస్సు రూపంలో వచ్చిన మృత్యువు వెంటాడింది. మండలంలోని పాలఖండ్యంకు చెందిన బత్తుల పోలరావు తమ పశువులను మేపుకొని ఇంటికి వస్తున్నాడు. గ్రామానికి సమీపంలో ఒడిశాకు చెందిన ఓ ప్రయివేటు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి అనంతరం పోస్టుమార్టానికి రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఎఎస్ఐ పొగిరి శంకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


పోలారావు మృతదేహం

కొట్టుకొచ్చిన మృతదేహం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు సముద్ర తీరంలో ఈ నెల 17న స్నానానికి వెళ్లి గల్లంతైన జంగం తరుణ్ మృతదేహం సోమవారం కొత్తపేట తీరానికి చేరింది. తోట స్నేహితులతో కలిసి వజ్రపుకొత్తూరు బీచ్‌లో స్నానం చేస్తుండగా సముద్రం అలల్లో చిక్కుకుని తరుణ్ గల్లంతయ్యారు. నాలుగు రోజులుగా బంధువులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తీరం వెంబడి గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం అలల ఉధృతికి కొత్తపేట తీరానికి మృతదేహం చేరింది. స్థానిక మత్స్యకారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.నిహార్ మృతుని తల్లిదండ్రులతో మృతదేహాన్ని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నిహార్

వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి అక్రమంగా నాటుసారా ప్యాకట్లతో మోహన్‌ను అరెస్టు చేసినట్లు సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, 200 నాటుసారా ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేశామన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


పోలాకి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాంలో సోమవారం పశువైద్య శిబిరంలో పాల్గొని మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. పాడి పశువుల వల్ల నిత్యం ఆదాయం ఉంటుందని, రైతులు పశువుల వ్యాధులకు కావాల్సిన వైద్యం అందించే నిమిత్తం ఈ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడి పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

రణస్థలం : మండలలోని దేవరాపల్లి, మరువాడ గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరం, ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రణస్థలం సబ్ డివిజన్ ఎడి డాక్టర్ బి.దుర్గారావు పాడి పశువులు పెంపకంలో మెళువుకువులు గురించి పాడి రైతులకు సూచనలు సలహాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని లోపెంటలో పశువైద్యాధికారి లావణ్య 200 పశువులకు, 300 గొర్రెలకు టీకాలు, నట్టల నివారణా మందులను పంపిణీ చేవారు. కార్యక్రమంలో పశువైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని భగవానపురంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 123 పశువులకు నట్టల నివారణా మందులను లింగాలవలస పశువైద్యాకారి మెట్ట పూర్ణచంద్రరావు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాడ సుకన్య, మండల మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, పొన్నాడ రాజారావు, మంచాల సింహాచలం, మంచాల రమణ, ఎన్.జయరాం పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పశువుల పెంపకంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని గోవిందపురం పశువైద్యాధికారి రాజ్‌కిరణ్ అన్నారు. ఉద్దానం గోపీనాథపురంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 48 జబ్బు పశువులకు చికిత్స చేశారు. 11 ఆవులకు గర్భకోస వ్యాధులకు చికిత్స చేశారు. 85 పశువులకు పొట్టపురుగులు మందులు, 80 మేకలకు పొట్టా పురుగులు మందులు, 212 కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్ని శ్రీను, మదనాల జోగారావు పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కల్లి ఉమాభారతిలు పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో భావన దుర్యోధన, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

పొందూరు: రైతులు పంటలతో పాటు పశుసంపదను పెంచుకుంటే సంపదను సృష్టించుకోవచ్చని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పశుసంపదను వృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 31 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొందూరు పశు వైద్యశాఖ ఎడి బాలకృష్ణ, పశువైద్యాధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వజ్రపుకొత్తూరు మండల సమావేశం

వజ్రపుకొత్తూరు: ఈ నెల 21న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రమేష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన ఉదయం పది గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

రోడ్డు మంజూరుకు కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడుకు శ్మశాన వాటికకు రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని పెసరపాడును సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఆమె స్పందించి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ, టిడిపి నాయకులు సాసుమాన చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న సాయికుమార్

సాయికుమార్ పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

లావేరు పంచాయతీ లావేటిపాళెంకు చెందిన వైసిపి కార్యకర్తలు యినపకుర్తి జనార్ధన్ చంద్రశేఖర్ కుటుంబాన్ని రణస్థలం ఎంపిపి ప్రతినిధి, ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ సోమవారం పరామర్శించారు. ఇటీవల చంద్రశేఖర్ తల్లి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న సాయికుమార్ ఆమె కుటుంబాన్ని పరామర్శించి తన సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. ఈయన వెంట ఎంపిటిసి యినపకుర్తి సతీష్, వైస్ సర్పంచ్ పైడి దాము, వైసిపి నాయకులు రాంబాబు, కొండక త్రినాథ్, శ్రీనివాసరావు, చిన్న సత్యనారాయణ, వెంకటరావు, రాజబాబు, ఆదినారాయణ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మెళియాపుట్టి : మండలంలోని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1978-79 పదో తరగతి విద్యార్థులు రెండు గదులకు పెయింటింగ్ కోసం రూ.పది వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. ఈ మేరకు ఆ బ్యాచ్ ప్రతినిధి నెమలిపురి యుగంధర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటరావుకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జి.జిగడాం : స్థానిక మోడల్ స్కూల్‌లో నిర్మించిన ఆర్‌ఒ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సోమవారం ప్రారంభించారు. సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా ఎన్‌ఎసిఎల్ కంపెనీ సౌజన్యంతో ఆర్‌ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎపిఎన్‌జి కంజ్వేషన్ మిషన్‌లో ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యార్థులకు అభినంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లంక ఆన్నా శ్యాముల్, మండల పార్టీ అధ్యక్షుడు కుమారాపు రవికుమార్, మక్కా నారాయణరావు, మజ్జి కన్నంనాయుడు, సర్పంచ్ ముద్దాడ గౌరి, మజ్జి హరి, మీసాల మోహన్ పాల్గొన్నారు.

మండలంలోని సంతవూరిటి నుంచి విజయరాంపురం, సంతవూరిటి నుంచి సీతారాంపురం, టి.డి.వలస నుంచి నక్కపేట వరకు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కుమారాపు రవికుమార్, మక్కా నారాయణరావు, మజ్జి కన్నంనాయుడు, సర్పంచ్ ముద్దాడ గౌరీ, మజ్జి హరి, మీసాల మోహన్, టంకాల మౌలి ఈశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు. అలాగే జి.సిగడాం సర్పంచ్ ముద్దాడ గౌరి తల్లి ఇటీవల మృతి ఒదింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్నామని కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు, తాగునీటి సరఫరా, మురుగు కాలువల్లో పూడికలు తీత, పల్లివీధిలో ధోబి ఘాట్, పద్మనాభపురం చెరువును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ వేకువజామున చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలిస్తున్నామని అన్నారు. నీటి సరఫరాలో సమస్యలను తెలుసుకొని మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సమస్యలను పరిష్కరించాలని మండలంలోని అచ్చినాపురరామ గిరిజనులు కోరారు. ఈ మేరకు బడే పాపారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆఫ్‌షోర్ కెనాల్ నిర్వాసితుల ఇళ్లకు సంబంధించి పరిహారాన్ని అందించాలని విన్నవించారు. గ్రామంలో ఆఫ్‌షోర్ కెనాల్ పనులు చేపడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు, జన్ని కూర్మారావు, ధర్మారావు, రాజు, సూరయ్య, ఆనంద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో అపూర్వమైనదని, సమాజ సేవకు కొంత సమయాన్ని వెచ్చించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎన్.ఇందిర అన్నారు. నగరంలోని స్థానిక మండల వీధిలో గల బాలుర ప్రభుత్వ పాఠశాలలో 2004-05 పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ మమేకమై చదువుకున్న పాఠశాలలో ఇరవై సంవత్సరాల తరువాత కలుసుకొని ఆనాటి సంగతులను గుర్తుచేసుకుని కష్ట, సుఖాలను నెమరువేసుకొని ఆనందంతో గడిపారు.

ధ్రువపత్రాలు జారీ చేయాలని వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆలయాల్లో సేవలందిస్తున్న పూజారులకు తరగతి ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కీర్తిపురానికి చెందిన గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై విప్ సానుకూలంగా స్పందించారు. అలాగే పాయతారు పంచాయతీ సైదలపుట్టుకు బాహుదా నదీ తీరాన శ్మశాన వాటిక మంజూరు చేయాలని కోరారు. దీంతోపాటు విద్యుత్ స్తంభాలు మార్చాలని విన్నవించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోపింటీ పద్మనాభం,


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గిన్ని బాలరాజు, దుపాన సూర్యనారాయణరెడ్డి, దక్కత గిరి, కొర్రాయి నర్సిహులు, భగవాన్ పాల్గొన్నారు.


వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలి

ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన వైద్యాధికారి దేవేంద్రరెడ్డితో మాట్లాడుతూ డ్యూటీ వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, దీనివల్ల రోగులు ప్రయివేటు ఆస్పత్రికి వెళ్తున్నారని తన దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రతి చిన్న కేసు కూడా చికిత్స చేయకుండా రిఫర్ చేయడం సరికాదన్నారు. ఆస్పత్రిలో నిర్వహణ సక్రమంగా ఉండడం లేదని ఫిర్యాదులొస్తున్నాయని అన్నారు. అనంతరం ఇటీవల సంభవించిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వార్డ్ కౌన్సిలర్లు బచ్చు జగన్, పిలక విజయ భాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు సెల్లా దేవరాజు, పోతల ఈశ్వరరెడ్డి, ప్రత్తి అన్వేష్, పి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ప్రసాదరావు

పాలకొండ రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పాలకొండ రోడ్డులో ఇటీవల తొలగించిన సెంటర్ డివైడర్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. రోడ్డులో కొత్తగా చేపడుతున్న పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సెంటర్ పార్కింగ్, విద్యుత్‌ద్దీపాల ఏర్పాటు వంటి ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఆయనతో పాటు మున్సిపల్ ఇంజినీరు దక్షిణామూర్తి ఉన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

కమిషనర్ రామారావు

ప్రజాశక్తి-పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అధికారులకు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, బిల్ కలెక్టర్స్ మెప్మా అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూలును వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఆస్తి పన్ను వసూల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి పన్నులు చెల్లించని యజమానులకు ఇంటి పైపులైన్, చెత్త సేకరణ నిలుపుదల, విద్యుత్ కనెక్షన్ల తొలగించాలన్నారు.